సాక్షి
నల్లగొండ
శుక్రవారం। 18। ఆగస్టు। 2023



సాగర్ నీటిని విడుదల చేయాలి

సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. - 8లో



ఎర్రవరంలో పూజలు

ఎర్రవరంలోని శ్రీబాల నరసింహస్వామి ఆలయాన్ని గురువారం సినీహీరో శ్రీకాంత్ దంపతులు దర్శించుకున్నారు. - 8లో



యాదాద్రిలో హరినామ సంకీర్తన

శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని యాదాద్రిలో గురువారం హరినామ సంకీర్తన కార్యక్రమాన్ని ప్రారంభించారు. - 8లో

న్యూస్‌రీల్

సంపద వనాలతో గ్రామాలకు ఆదాయం



సంపద వనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన సంపద వనాలతో గ్రామాలకు ఆదాయం సమకూరుతుందని గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. గురువారం తిరుమలగిరి సాగర్ మండలంలోని అల్వాల గ్రామంలో ఇటీవల నాటిన సంపద వనాలను ఆయన పరిశీలించారు. సంపద వనంలో కానుగ, పూల మొక్కలు నాటడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సంపద వనాల్లో ఎక్కువగా పండ్లు, సంపద వచ్చే మొక్కలనే నాటాలని, ఇలా పూల మొక్కలను నాటితే ఉపయోగం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. నాగార్జునసాగర్ నర్సరీలో ఉన్న మొక్కలను తీసుకొవచ్చి నాటాలని ఆదేశించారు. ఆయన వెంట ఎఫ్‌డీఓ సర్వేశ్వర్, ఏపీడీ శైలజ, ఎంపీడీఓ ఖాజా అస్గర్‌అలీ, సర్పంచ్ పెంకీసు పాపిరెడ్డి, ఏపీఓ శ్రీరాములు, టీఏ బాలాజీ, కార్యదర్శి జ్యోతి తదితరులు ఉన్నారు.

హాలియా : మొక్కలు నాటే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. గురువారం హాలియా పట్టణంలోని రెండో వార్డులో ఏర్పాటు చేసే సంపద వనం పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, కమిషనర్ కందిమళ్ల వీరారెడ్డి, ఎంపీడీఓ లక్ష్మి తదితరులు ఉన్నారు.

హాకీ, చెస్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న 1104 యూనియన్ కార్యదర్శి వెంకటయ్య

నల్లగొండ : పట్టణంలోని అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కం ఇంటర్ సర్కిల్ హాకీ పోటీలను, ఎలక్ట్రిసిటీ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహిస్తున్న చెస్ టోర్నమెంట్‌ను సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రమోహన్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 జిల్లా కార్యదర్శి నిమ్మచెట్ల వెంకటయ్య గురువారం ప్రారంభించారు. హాకీ టోర్నమెంట్‌లో కరీంనగర్ - విద్యుత్ సౌదా పోటీ పడగా కరీంనగర్ 4.0తో గెలుపొందింది. అదేవిధంగా నల్లగొండ - నిజామాబాద్‌తో పోటీ పడగా 1.0 తేడాతో నిజామాబాద్ గెలుపొందినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీఈలు వెంకటయ్య, ఏఈలు, స్పోర్ట్స్ అధికారులు నీలం జగన్నాథ్, రాజు, బాలు, అంజన్‌రావు, సలీం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

నల్లగొండ : టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) థియరీ పరీక్షకు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో అభ్యర్థులకు సూచించారు. ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శిశుగృహలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



చిన్నారిని లాలిస్తున్న జెడ్పీ స్థాయీ సంఘం సభ్యులు

నల్లగొండ : నల్లగొండ పట్టణంలోని శిశుగృహలో చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి కంటికి రెప్పలా కాపాడాలని జిల్లా పరిషత్ 5వ స్థాయీ సంఘం చైర్మన్ కంకణాల ప్రవీణ కోరారు. గురువారం ఆమె జెడ్పీ స్థాయీ సంఘం సభ్యులు, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులతో కలిసి శిశుగృహ, బాలసదన్‌ను సందర్శించారు. చిన్నారుల వివరాలను, వారి ఆలనాపాలన, సిబ్బంది పని తీరు, చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో ముచ్చటించారు. కార్యక్రమంలో జెడ్పీ డీప్యూటీ సీఈఓ కాంతమ్మ, మహిళాశిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

బత్తాయి ధర పతనం



మార్కెట్‌కు తరలిస్తున్న బత్తాయిలు

- టన్ను ధర తోటల వద్ద రూ.15 వేల లోపే..
- ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షాలతో తగ్గిన డిమాండ్
- యాభై శాతం కాయలు చెట్లపైనే
- తొడిమెకుళ్లు తెగులుతో రాలుతున్న బత్తాయిలు
- నష్టాల పాలవుతున్న రైతులు



రాలిన బత్తాయిలు

గుర్రంపోడు : బత్తాయి ధర భారీగా పతనమైంది. నెల రోజుల క్రితం బత్తాయి ధర టన్నుకు రూ.25 వేల వరకు పలుకగా క్రమంగా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం నాణ్యత గల కాయలకు తోటల వద్ద టన్నుకు రూ.15 వేల లోపే ధర పలుకుతోంది. మంగు, నాణ్యతలో తేడా ఉంటే రూ.10 నుంచి రూ.12 వేల వరకే ధర ఉంటోంది. రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాలో బత్తాయి ఎక్కువగా సాగవుతుంది. ఇక్కడి నుంచి ఢిల్లీ, కలకత్తా, ఆగ్రా, ముంబయిలోని మార్కెట్‌కు కాయలు ఎగుమతి అవుతాయి. కాగా ఇటీవల ఉత్తరాది రాష్ట్రాల్లో ప్రధానంగా ఢిల్లీలో కురిసిన భారీ వర్షాలకు మార్కెట్‌లు రోజుల తరబడి బంద్ అయ్యాయి. ఇప్పుడు ఒక్కసారిగా మార్కెట్‌కు దిగుబడులు రావడం ధర పతనానికి కారణమైంది. కత్తెర దిగుబడులు తగ్గి సీజన్ దిగుబడులు ఎక్కువగా ఉండటం కూడా ధర తగ్గడానికి కారణం అంటున్నారు. కత్తెర పంటతో పోలిస్తే సీజన్ బత్తాయి ధర తగ్గడం సాధారణమే. అయినా.. మరీ ఇంతగా పడిపోవడం రైతులను నష్టాల్లోకి నెట్టింది.

48,860 ఎకరాల్లో బత్తాయి తోటలు..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 48,860 ఎకరాల్లో బత్తాయి సాగవుతోంది. జూలై నుంచి సెప్టెంబర్ వరకు సీజన్ దిగుబడి రెండు లక్షల టన్నుల వరకు ఉంటుంది. ఇప్పటి వరకు లక్ష టన్నుల మేర బత్తాయిలు కోసినట్లు అంచనా. ఈసారి వర్షాభావ పరిస్థితుల వల్ల సీజన్ పంటకు టన్నుకు రూ.25 వేల వరకు ధర ఉంటుందని రైతులు ఆశించారు. కానీ ధర పడిపోవడం, ప్రస్తుత ధరకు అమ్ముకోలేక ఎదురు చూస్తుండడంతో కాయలు పక్వానికి వచ్చి నాణ్యత దెబ్బతిని తొడిమ కుళ్లు సోకి రాలిపోతున్నాయి. సెప్టెంబర్‌లో ధర కొంత వరకు పెరిగే అవకాశం ఉన్నా అప్పటి వరకు ఎదురుచూస్తే కాయలు రాలిపోయి లాభం ఉండదేమోననే రైతులు ఆందోళన చెందుతున్నారు. లేత తోటలు, ఆరోగ్యకరంగా ఉండి పూత ఆలస్యంగా వచ్చిన తోటల కాయలకు మాత్రం సెప్టెంబర్ నెలలో మంచి ధర లభిస్తుందని భావిస్తున్నారు.

ధర కోసం ఎదురుచూస్తున్న..



బత్తాయి ధర ఈ నెలాఖరు వరకు పెరిగే ఉందని ఎదురుచూస్తున్నా. గురువారం మార్కెట్‌లో కొంత పెరుగుదల ఉందని తెలిసింది. తోటలో కాయలు రాలుతున్నా మరీ ఇంత తక్కువ ధరకు అమ్మాలంటే కష్టంగా ఉంది. ఏటేటా పెట్టుబడులు పెరుగుతున్నా బత్తాయి ధరలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. బత్తాయి మార్కెట్‌లో మద్దతు ధర లభించేలా.. చూట్, కమీషన్‌లు తగ్గించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వెంకటేశ్వర్‌రావు, రైతు, కోయగూరోనిబావి

టన్ను రూ.12 వేలకే అమ్ముకున్న



నాకున్న మూడు ఎకరాల బత్తాయి తోటలో కాయలు పక్వానికి వచ్చి తొడి కుళ్లు ఆశించి రాలుతుండటంతో టన్ను 12 వేల రూపాయలకు అమ్ముకున్నా. అందులోనూ వ్యాపారి పది వేల రూపాయలు ఎగ్గొట్టాడు. 50 వేల రూపాయల నష్టం వచ్చింది. టన్ను ధర కనీసం రూ.25 వేల పైన ఉంటేనే లాభదాయకంగా ఉంటుంది.

– వంటిద్దు భిక్షంరెడ్డి, రైతు, నడికూడ

బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించాలి



చెక్కు అందజేస్తున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి, కలెక్టర్ కర్ణన్

- రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి

నకిరేకల్ : తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ఆగకుండా ఉండాలంటే మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్నే ఆదరించాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పేర్కొన్నారు. నకిరేకల్‌లోని సువర్ణ గార్డెన్‌లో గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా 300 మందికి రూ.1 లక్ష చెక్కులను కలెక్టర్ కర్ణన్‌తో కలిసి వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బడుగుల, చిరుమర్తి మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారనిచెప్పారు. కలెక్టర్ కర్ణన్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా వృద్ధి సాధించాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, ఎంపీపీలు జిల్లా ముత్తిలింగయ్య, కోలను సునీత, జ్యోతి, జెడ్పీటీసీలు మాధ ధనలక్ష్మి, స్వర్ణలత, బలరాం, ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఏకరువు..

- జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో అధికారులపై సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

నల్లగొండ : కరెంట్ సక్రమంగా ఇవ్వడం లేదు. మిషన్‌భగీరథ నీరు ఇంటింటికీ అందడం లేదు. చెరువులు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోవడం లేదు. పింఛన్ల మంజూరులో అధికారులు నిర్లక్ష్యం వహిసున్నారు.. ఇలా సమస్యలను ఏకరువు పెట్టారు పలువురు జెడ్పీటీసీ సభ్యులు. జిల్లా పరిషత్ 1, 2, 3, 4, 5, 6, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి అధ్యక్షతన గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. కరెంటు సక్రమంగా ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందని తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని నాంపల్లి జెడ్పీటీసీ పేర్కొన్నారు. కనగల్ జెడ్పీటీసీ వెంకటేశం మాట్లాడుతూ ఊట్కూర్ నుంచి మైనంపల్లి రోడ్డును రైతులే మరమ్మతు చేసుకుంటున్నారని చెప్పారు. కనగల్ చెరువు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఎల్‌సీ పేరుతో విద్యుత్ సమస్య ఏర్పడుతుందని చెప్పారు. చందూర్ జెడ్పీటీసీ మాట్లాడుతూ చేనేత, గౌడ సంఘాల్లో సభ్యుడిగా ఉన్న భర్త చనిపోతే వితంతు పింఛన్ ఇవ్వడం లేదన్నారు. చింతపల్లి జడ్పీటీసీ చైర్మన్ ప్రమీల మాట్లాడుతూ అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు బాల్య వివాహాలు, శిశు విక్రయాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని మర్రిగూడ జెడ్పీటీసీ సురేందర్‌రెడ్డి కోరారు.

భూముల సర్వేలో వివక్ష..

దేవరకొండ డివిజన్ ప్రాంతంలో రైతుల భూముల సర్వే విషయంలో డీఐ వంశీ పట్టించుకోవడం లేదని నాంపల్లి జడ్పీటీసీ ఆరోపించారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారుల భూముల సర్వేకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చాడు. స్పందించిన ఏడీ ల్యాండ్ సర్వేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ కాంతమ్మ, స్టాండింగ్ కమిటీ చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

ఖజానాకు కిక్కు!

- మద్యం టెండర్లతో భారీగా సమకూరుతున్న ఆదాయం
- ఇప్పటివరకు 4,535 దరఖాస్తులు
- టెండర్ ఫీజు ద్వారా రూ.90.70 కోట్లు రాక
- నేడే ఆఖరు.. భారీగా రానున్న దరఖాస్తులు



ఎక్సైజ్ కార్యాలయంలో టెండర్‌దారుల బారులు

నల్లగొండ క్రైం : జిల్లాలో 155 మద్యం దుకాణాల టెండర్ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం భారీగా సమకూరుతోంది. ఈ నెల 4వ తేదీ నుంచి 18వ తేదీ దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉంది. గురువారం ఒక్కరోజే 1650 దరఖాస్తులు వచ్చాయి. వీటితో కలిపి ఇప్పటి వరకు మొత్తం 4,535 దరఖాస్తులు రావడంతో ప్రభుత్వానికి రూ.90.70 కోట్ల ఆదాయం వచ్చింది. టెండర్ల దాఖలుకు శుక్రవారం ఆఖరు కావడంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. గత టెండర్లలో మొత్తం 4,079 దరఖాస్తులతో రూ.81.58 కోట్ల ఆదాయం రాగా.. ఈ సారి ఆ సంఖ్య ఇప్పటికే దాటింది. ఎన్నికల సమయం కావడంతో వ్యాపారులు లాభనష్టాలను బేరీజు వేసుకుంటున్నారు. అయితే సింగిల్‌గా కాకుండా నలుగురు కలిసి ఒక్కరి పేరిటనే వేసే దరఖాస్తులు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

రిజర్వేషన్ల వారీగా కేటాయింపు..

జిల్లాలో 155 మద్యం దుకాణాలకు ఈనెల 4 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 155 మద్యం షాపుల్లో 34 గౌడ్స్, 14 ఎస్సీ, 4 ఎస్టీలకు రిజర్వేషన్ కింద కేటాయించారు. మిగిలిన 103 మద్యం షాపులను జనరల్‌కు కేటాయించారు. 2019–21 సంవత్సరంలో 155 మద్యం దుకాణాలకు నిర్వహించిన టెండర్‌లో జిల్లా వ్యాప్తంగా 4,079 దరఖాస్తులు రాగా వీటిద్వారా రూ.81.58 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ సారి ఆదాయం రూ.100 కోట్ల పైనే ఉంటుందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు.

తరలివస్తున్న వ్యాపారులు..

టెండర్ దాఖలుకు గురువారం మద్యం వ్యాపారులు భారీగా తరలివచ్చారు. టెండర్ దాఖలు కేంద్రాలు ఎన్నికల వాతావరణాన్ని తలపిస్తున్నాయి. ఉద్యోగస్తులు వారి కుటుంబ సభ్యుల పేరిట టెండర్ వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మద్యం వ్యాపారులు గతంలో జిల్లాలో పరిచయం ఉన్న వారితో ఒప్పందం చేసుకొని టెండర్లలో పాల్గొనేవారు. ఈసారి టెండర్ వేసేందుకు ఏపీ నుంచి పెద్దగా రానట్లు తెలుస్తోంది. వారు ఈ సారి హైదరాబాద్‌లో టెండర్ వేస్తున్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు రిజర్వేషన్ కింద కేటాయించిన షాపులకు టెండర్ వేసేందుకు అర్హత లేకపోవడంతో బంధుత్వం ఉన్న వారితో భాగస్వామ్యం కలుపుకొని టెండర్లలో పాల్గొంటున్నారు.

ఎర్రవరంలో మొక్కులు..

మద్యం టెండర్లలో పాల్గొనే వ్యాపారులు కోదాడలోని ఎర్రవరం లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మొక్కి పూజారులతో జాతకాలు చూపించి ఎవరి పేరిట బాగుందో తెలుసుకుంటున్నారు. పంచాంగంలో నిష్ణాతులైన పూజారులను వెతికి అదృష్టం వరించే విషయమై జాతక పుస్తకాలను తిరిగేస్తున్నారు. టెండర్ వేసేందుకు ఒక్కరిపైనే ఆర్థిక భారం పడకుండా భాగస్వామిగా ఉండే వారి జాతకాలను కూడా చూసుకొని అంతర్గతంగా రాతపూర్వక ఒప్పందాలు చేసుకొని దరఖాస్తులు వేస్తున్నారు. మహిళల పేరిట జాతయాలు బాగుంటే వారితో దరఖాస్తులు రాసి టెండర్లు వేస్తున్నారు.

పరిశోధనలపై దృష్టి పెట్టాలి

నల్లగొండ రూరల్ : ప్రతి విద్యార్థి సామాజిక స్పృహ కలిగిన పరిశోధనలపై దృష్టి సారించాలని ఉస్మానియా లా కళాశాల ప్రొఫెసర్ బిబి రెడ్డి అన్నారు. గురువారం ఎంజీయూలో సైన్స్ అండ్ టెక్నాలజీపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వీసీ గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ కృష్ణారావు, అధ్యాపకులు రవి, రమేష్, అన్నపూర్ణ, ప్రశాంతి, కళ్యాణి, జ్యోతి ఉన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్



మార్కెట్ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ టూటౌన్ : నల్లగొండలోని బీట్ మార్కెట్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం నీలగిరి పట్టణంలోని బీట్‌మార్కెట్‌లో నిర్మిస్తున్న వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఎలివేషన్, టాయిలెట్స్, క్యాంటీన్ తదితర పనులు పూర్తి చేయాలన్నారు. చుట్టూ ప్రహరి గోడ ఎత్తు పెంచి కలర్‌లు వేయాలని, గేట్ ఏర్పాటు చేయాలని ప్రజారోగ్య శాఖ అధికారులకు సూచించారు. అనంతరం ఐటీ టవర్ పక్క నుంచి డ్రెయినేజీ వద్ద ఫుట్ పాత్ ఏర్పాటు చేయాలని, సమీపంలో ఉన్న కంప చెట్లు తొలగించాలని అధికారులకు సూచించారు. ఐటీ టవర్ భవనం చుట్టూ మొక్కలు నాటాలని, అన్ని పనులు సెప్టెంబర్ 5వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కెవి.రమణాచారి, ప్రజారోగ్య శాఖ ఈఈ సత్యనారాయణ, ఏసీపీ నాగిరెడ్డి పాల్గొన్నారు.

ప్లాంటేషన్ పూర్తి చేయాలి

నార్కట్‌పల్లి : సంపద వనం ప్లాంటేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం నార్కట్‌పల్లి మండల పరిధిలోని శేరుబావిగూడెం, కొండపాకగూడెం సమీపాన నూతనంగా ఏర్పాటు చేస్తున్న సంపద వనం భూమి చదును పనులను ఆయన పరిశీలించారు. సంపద వనంలో పండ్ల మొక్కలు నాటాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ గుండబోని యాదగిరి, ఏపీఓ యాదగిరి, ఈసీ రాంబాబు తదితరులు ఉన్నారు.

కస్తూర్బా కాలేజీల్లో సీట్లు ఖాళీ

- ఇంటర్‌లో చేరేందుకు విద్యార్థినుల విముఖత
- అన్ని గ్రూపులు.. ఇంగ్లిష్ మీడియం లేకపోవడమే కారణం
- ఖాళీలను నింపేందుకు అధికారుల ప్రయత్నాలు



మునుగోడు కేజీబీవీ

మునుగోడు : బాలికల అక్షరాస్యత శాతం పెంచడంతో పాటు చదువు మధ్యలో మానేసిన బాలికలను ప్రభుత్వం చేరదీసి వారికి విద్యతో పాటు వసతి కల్పించేందుకు 11 ఏండ్ల క్రితం కస్తూర్బా గాంధీ విద్యాలయాలను (కేజీబీవీ) ఏర్పాటు చేసింది. కేజీబీవీలను మొదట పదో తరగతి వరకు కొనసాగించిన ప్రభుత్వం ఆ బాలికలకు కళాశాల విద్య సైతం అందించేందుకు అదే పాఠశాలల్లో ఐదేళ్ల క్రితం కళాశాలలను కూడా ప్రారంభించింది. అయితే ఆ కళాశాలల్లో చేరేందుకు రెండేళ్లుగా బాలికలు ముందుకురావడం లేదు. దీంతో ఆ పాఠశాలల ప్రత్యేక అధికారులు ఖాళీ సీట్లను నింపేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా ఆ కళాశాలల్లో విద్యనభ్యసించేందుకు ముందుకు వచ్చే బాలికల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతోంది.

జిల్లాలో 14 కళాశాలలు..

జిల్లాలో బాలికల అక్షరాస్యత శాతం తక్కువగా ఉన్న మండలాల్లో 11 ఏండ్ల కాలంలో విడతల వారీగా 16 కేజీబీవీలను ఏర్పాటు చేశారు. వాటిలోనే 14 చోట్ల జూనియర్ కళాశాలలను ప్రారంభించారు. ప్రతి కాలేజీలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుల్లో ఏవైనా రెండు గ్రూపులు ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రూపులో 40 మంది చొప్పున మొదటి సంవత్సరానికి 80 మంది, రెండో సంవత్సరానికి 80 మంది మొత్తం 160 మంది విద్యార్థినులు ఇంటర్ విద్యను అభ్యసించేలా ఏర్పాట్లు చేశారు. కానీ అధికారులు కేటాయించిన అంతమంది విద్యార్థినులు కళాశాలల్లో చేరడం లేదు. మొత్తం 14 విద్యాలయాల్లో 2240 మంది విద్యార్థినులు ఇంటర్ విద్యను అభ్యసించే అవకాశం ఉన్నప్పటికీ ప్రస్తుతం ఒక్కో విద్యాలయంలో 100 నుంచి 105 వరకు మొత్తం 1450 మంది మాత్రమే ఇంటర్ విద్యాభ్యాసం చేస్తున్నారు.


ఇంగ్లిష్ మీడియం లేకపోవడంతో..

కేజీబీవీ కళాశాలల్లో విద్యార్థినులు చేరకపోవడానికి పలు కారణాలు ఉంటున్నాయి. మూడు, నాలుగు కళాశాలలు మినహా మిగతా చోట్ల ఇప్పటికీ తెలుగు మీడియంలో బోధించడం. అధికంగా సైన్స్ గ్రూపుల్లో చేరుతుండగా అందులో ఐదు కళాశాలల్లో కేవలం ఆర్ట్స్ గ్రూపులు చదివే అవకాశం కల్పించడం వల్ల కేజీబీవీల్లో చేరేందుకు విద్యార్థినులు ముందుకు రావడం లేదు. అన్ని కళాశాలల్లో సైన్స్, ఆర్ట్స్ గ్రూపులు ఏర్పాటు చేయడంతో పాటు ఇంగ్లిష్ మీడియం బోధన చేస్తే బాగుండని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

వృత్తి విద్యా కోర్సులోనే చేరిక..

మునుగోడు కేజీబీవీలో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు బోధించేందుకు అనుమతి ఇచ్చారు. అయితే ఆ కళాశాలల్లో మొత్తం 160 మంది చేరాల్సి ఉండగా అందులో ఇప్పటి వరకు 105 మంది మాత్రమే చేరారు. అది కూడా వృత్తివిద్యా కోర్సు అయిన ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో దాదాపు 75 మందికిపైగా చేరగా సీఈసీలో అతి తక్కువ మంది చేరారు.

దశలవారీగా అనుమతిస్తున్నాం



ప్రభుత్వ సూచనల ప్రకారం అధికంగా కళాశాలల్లో తెలుగు మీడియం బోధన చేస్తున్నాం. అయితే విద్యార్థినులు ఇంగ్లిష్ మీడియంపై ఆసక్తి చూపుతుండడంతో పలు కళాశాలల్లో దశలవారీగా ఇంగ్లిష్ మీడియం బోధన చేయిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా మొత్తం 14 కళాశాలలు ఉండగా 9 చోట్ల సైన్స్ గ్రూపులు నాలుగు చోట్ల ఇంగ్లిష్ మీడియంలో, ఐదు చోట్ల ఆర్ట్స్ గ్రూపుల తెలుగు మీడియంలో బోధన సాగుతోంది.

– పి.సరిత, జీసీడీఓ, నల్లగొండ

ఇంగ్లిష్ మీడియం ఉంటే బాగుండు

మునుగోడు కేజీబీవీలో తెలుగు మీడియం ఆర్ట్స్ గ్రూపు మాత్రమే బోధిస్తున్నారు. మా కుమార్తై సైన్స్ గ్రూపు చదవాలని నిర్ణయించుకుంది. దీంతో మా కుమార్తైను నల్లగొండ ప్రభుత్వ కళాశాలలో చేర్పించా.

– ఏరుకొండ నాగరాజు, విద్యార్థిని తండ్రి, మునుగోడు

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసే వరకూ పోరాడుతామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సమ్మెలో భాగంగా గురువారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. 16 ఏళ్లుగా పనిచేస్తున్న సెంకడ్ ఏఎన్‌ఎంలను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి వారికి న్యాయం చేయాలని కోరారు. ఉద్యోగులపై ప్రభుత్వ మొండి వైఖరి సరి కాదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి లెనిన్, జిల్లా అధ్యక్షురాలు రత్నకుమారి, కార్యదర్శి నర్సమ్మ, పద్మ, నాగమణి ఉన్నారు.

క్లుప్తంగా

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న సీపీ చౌహాన్

భువనగిరి : అనారోగ్యంతో మృతిచెందిన భువనగిరి పట్టణానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ విజయ భాస్కర్‌రావు కుటుంబ సభ్యులకు గురువారం రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ డీఎస్ చౌహాన్ రూ. 7,77,058ల విలువ చేసే చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సీపీ చౌహాన్ మాట్లాడారు. మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి త్వరగా పెన్షన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజేష్ చంద్ర పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నేరేడుచర్ల : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిచాలని కోరుతూ బీఆర్‌టీయూ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిలువేరు ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో సీడీపీఏ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేరేడుచర్ల మున్సిపల్ కార్మిక యూనియన్ అధ్యక్షుడు ఎస్‌కె జాని, నాయకులు శ్రీనయ్య, నర్సింహారావు, సమ్మయ్య, సతీష్, మహేందర్, మల్లేశం, ప్రసాద్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



జీవరత్నం మృతదేహం

తిరుమలగిరి (నాగార్జునసాగర్): విద్యుదాఘాతంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. తిరుమలగిరి మండలం అల్వాల గ్రామశివారులో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా.. నిడమనూరు మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన కొండేటి జీవరత్నం(40) హిటాచ్చి(జేసీపీ చైన్ బండి) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం పెద్దవూర మండలం చలకుర్తి గ్రామశివారులో పనిచేసుకొని తిరిగి నాగార్జునసాగర్ ఎడమ కాలు కట్ట మట్టి రోడ్డు వెంట లారీపై హిటాచ్చిని తీసుకొని వస్తున్నాడు. ఈ క్రమంలో అల్వాల ఆర్ 1 లిఫ్టు వద్ద 11కేవీ విద్యుత్ వైరు లారీపై ఉన్న హిటాచ్చికి తాకడంతో అందులో ఉన్న జీవరత్నం విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. అటువైపుగా వెళ్తున్న వారు గమనించి సంఘటన స్థలం వద్దకు వచ్చి పోలీసులకు సమాచారం అదించారు. ఎస్‌ఐ సురేష్ తన సిబ్బందిని తీసుకొని సంఘటన స్థలానికి చేరుకొని జీవరత్నంను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

పురుగుల అన్నం వద్దంటూ..

- హాలియా తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థుల ధర్నా



హాలియా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు



అన్నంలో వచ్చిన పురుగులు

హాలియా : మధ్యాహ్న భోజనంలో పురుగుల అన్నం వడ్డించారని ఆరోపిస్తూ హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గురువారం హాలియాలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మొత్తం 350 మంది విద్యార్థులు ఉండగా ప్రతి రోజు 250 మంది దాక మధ్యాహ్న భోజనం తింటున్నారు. అయితే గురువారం మధ్యాహ్నం వడ్డించిన భోజనంలో పురుగులు కనిపించడంతో ఈ అన్నం మేము తినలేమంటూ ఒక్కరిగా విద్యార్థులంతా కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి ప్లేట్లతో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వడ్డిస్తున్న భోజనంలో పురుగులు వస్తున్నాయని తెలిపారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పలు మార్లు చెప్పినా వారు పట్టించుకోవడం లేదని వాపోయారు. విద్యార్థుల సమస్యను పట్టించుకునే దాక ఇక్కడి నుంచి కదిలేదిలేదని భీష్మించి కూర్చున్నారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ బుసిరెడ్డి రామకృష్ణారెడ్డి విద్యార్థుల వద్దకు వచ్చి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పాఠశాల వద్దకు వెళ్లి ఆయన మధ్యాహ్నం భోజనం వడ్డించిన బియ్యాన్ని పరిశీలించారు. అందులో పురుగులు ఉన్నట్లు గుర్తించారు. పురుగులు పట్టిన బియ్యాన్ని విద్యార్థులకు వడ్డించ వద్దని వెంటనే ఆ బియ్యాన్ని తిరిగి పంపించాలని డిప్యూటీ తహసీల్దార్ పాఠశాల ఏజెన్సీకి సూచించారు. ఇదే విషయంపై పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డిని వివరణ కోరగా ఎక్కువ కాలం బియ్యం నిల్వ ఉండడం కారణంగా బూజు పట్టాయని, వాటిని ఎప్పటికప్పుడు కడిగి శుభ్రం చేశాకే మధ్యాహ్న భోజన నిర్వాహకులు అన్నం వండుతున్నారన్నారు. ఈ రోజు మాత్రమే విద్యార్థులకు వడ్డించిన మధ్యాహ్నభోజనంలో పురుగులు వచ్చాయని, ఇక నుంచి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



నాగయ్య (ఫైల్)

హుజూర్‌నగర్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన హుజూర్‌నగర్ మండల పరిధిలో ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొండానాగయ్య(38) పేయింటర్‌గా పనిచేస్తున్నాడు.16ఏళ్ల క్రితం గోపాలపురానికి చెందిన సిద్దెల భిక్షం కుమార్తె రేణుకతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు కుమార్తె సంతానం.ఈ క్రమంలో నాగయ్య భార్య ఇద్దరు పిల్లలతో స్వగ్రామమైన సింగారెడ్డి పాలెంనుంచి ఈనెల 14న కోదాడలోని బంధువుల ఇంటికి వెళ్లాడు.అదే రోజు సాయంత్రం అత్తగారిల్లెన్న హుజూర్‌నగర్ మండలం గోపాలపురానికి చేరుకున్నారు.

ఇటుక బట్టీల సమీపంలో విగతజీవుడిగా..

మరుసటి రోజు 15వ తేదీన తెల్లవారుజామునే నాగయ్య గోపాలపురం నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. నాగయ్య ఇంటికి చేరిన తెలుసుకునేందుకు మామ భిక్షం అల్లుడికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. బంధువుల ద్వారా నాగయ్య ఇంటికి చేరలేదనే విషయం తెలుసుకుని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే గురువారం గోపాలపురంలో సమీపంలో రోడ్డు పక్కన ఇటుక బట్టీల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం నాగయ్యదిగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి మామ భిక్షం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరికృష్ణ తెలిపారు.

దైవదర్శనం చేసుకొని వస్తూ.. మృత్యుఒడికి

- రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు

నార్కట్‌పల్లి : గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. నార్కట్‌పల్లి మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రామన్నపేట మండలం ఉత్తటూరు గ్రామానికి చెందిన జంగిలి రాకేష్, తన భార్య లిఖిత (20), తల్లి అలువేలుతో కలిసి బుధవారం నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిద్ర చేశారు. గురువారం ఉదయం దైవ దర్శనం చేసుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి మండల పరిధిలోని గ్రీన్‌సిటీ వెంచర్ సమీపంలోకి రాగానే నల్లగొండ నుంచి నార్కట్‌పల్లి వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న లిఖిత (20)తో పాటు భర్త, అత్తకు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన లిఖితను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. గాయపడిన మరో ఇద్దరిని స్థానిక కామినేని అస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఆవుల ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.



లిఖిత (ఫైల్)

బైకు పైనుంచి జారిపడి మహిళ ..

చౌటుప్పల్ : ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం పైనుంచి జారిపడి మహిళ మృతి చెందింది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన రుద్రాల కవిత(39) జీహెచ్‌ఎంసీలో ఔట్ సోర్సింగ్ స్వీపర్‌గా పని చేస్తుంది. కుటుంబ సభ్యులతో కలిసి అంబర్‌పేటలో నివాసం ఉంటోంది. తెలిసిన వ్యక్తితో కలిసి బైకుపై నార్కట్‌పల్లి నుంచి అంబర్‌పేటకు వెళ్తుండగా దండుమల్కాపురం గ్రామపంచాయతీ మధిర బొర్రోళ్ల గూడెం స్టేజీ వద్ద హైవేపై ప్రమాదవశాత్తు జారి కిందపడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తల్లి గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.దేవేందర్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

నకిరేకల్ : బైక్ అదుపుతప్పి యువకుడు మృతిచెందాడు. సూర్యాపేట పట్టణానికి చెందిన నల్లగట్టు ఆనంద్(20) గురువారం ఉదయం తన బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. నకిరేకల్‌లోని పద్మానగర్ జంక్షన్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఆనంద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని నకిరేకల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తల్లి ఝాన్సీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

ఆస్తమా వ్యాధి నివారణకు కృషి



రీసెర్చ్ మద్దతు పత్రాన్ని పరిశోధన వైద్యుడికి అందజేస్తున్న ఎయిమ్స్ డైరెక్టర్

బీబీనగర్: ఆస్తమా వ్యాధి నివారణకు కృషి చేయనున్నట్లు ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా తెలిపారు. ఆస్తమా వ్యాధిపై పరిశోధన చేసేందుకు డీబీటీ ఇండియా నుంచి ఎయిమ్స్ వైద్యులకు రీసెర్చ్ గ్రాంట్ ద్వారా మద్దతు లభించిన సందర్భంగా ఆయన గురువారం ఎయిమ్స్‌లో వైద్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేశంలోని 30మిలియన్లకు పైగా ప్రజలు ఉబ్బసం కలిగివున్నారని, వారిలో 70శాతం మందికి మాత్రమే రోగ నిర్ధారణ ఉందని తెలిపారు. సమావేశంలో వైద్యులు రోహిత్ సలూజా, హిమాద్రిసింగ్, అలేక్షఖురానా, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఆ అడుగులు.. చిరుతవి కావు

- అటవీశాఖ రేంజ్ అధికారి బాబిరెడ్డి

గుర్రంపోడు : గుర్రంపోడు మండలంలోని నడికూడ గ్రామంలో కనిపించిన అడుగులు చిరుతపులివి కావని నిర్ధారించినట్లు అటవీశాఖ రేంజ్ అధికారి బాబిరెడ్డి తెలిపారు. పులి గోర్ల ముద్రలు లేవని అడుగులు అడవికుక్క లేదా హైనావి అయి ఉండవచ్చునని తెలిపారు. హైనాలతో మనుషులకు ఎలాంటి ప్రమాదం ఉండదని, మేకలు, గొర్రెల మీద దాడి చేసి తింటుందని తెలిపారు. ఇప్పటి వరకు ఆహారం కొరకు ఎలాంటి జంతువు బలి అయినట్లు సమాచారం లేనందున అడవి కుక్క కావొచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు భయాందోళనకు గురికావద్దన్నారు.

మెడికల్ షాపులో నగదు చోరీ

ఆలేరురూరల్ : గుర్తుతెలియని వ్యక్తులు మెడికల్ షాపులో చోరీకి పాల్పడ్డారు. ఆలేరు పట్టణ కేంద్రంలో బస్టాండ్ ఎదురుగా ఉన్న పద్మజా మెడికల్ షాపును యజమాని సారాబు సంతోష్ రాత్రి 9 గంటలకు మూసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో దొంగలు షటర్ తాళం పగలగొట్టి లోపలికి చొరబడి గల్లా పెట్టెలో ఉన్న రూ. 95 వేల నగదును ఎత్తికెళ్లారు. పక్కన ఉన్న మరో సాయి కృష్ణ కమ్యూనికేషన్ షాపులో చోరీకి యత్నించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపారు.

గడ్డి మందు తాగిన యువతి మృతి

మోతె : కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందింది. చివ్వెంల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన గుండారపు సైదులు, నాగమ్మ దంపతుల కుమార్తె వినితకు మూడు నెలల కిత్రం మోతె మండలం రావిపహాడ్ గ్రామానికి చెందిన నిమ్మల మల్లయ్యలక్ష్మమ్మ దంపతుల చిన్న కుమారుడు నరేష్‌తో వివాహం జరిగింది. వినిత నెల రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. మనస్తాపం చెందిన వినిత ఈ నెల 12న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం సూర్యాపేటలో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మోతె ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

యాదాద్రిలో హరి నామ సంకీర్తన



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నర్సింహమూర్తి

యాదగిరిగుట్ట: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ప్రధానాలయంలో గురువారం హరినామ సంకీర్తన కార్యక్రమాన్ని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి ప్రారంభించారు. స్వామివారికి సంకీర్తన అత్యంత ప్రీతికరమని, నవ విధ భక్తి మార్గాల్లో సంకీర్తన మోక్షానికి అత్యంత దగ్గరి మార్గమని భావించిన అధికారులు ఆలయ ప్రాకార మండపంలో హైదరాబాద్‌కు చెందిన హరినామ సంకీర్తన భక్త భజన సంకీర్తన ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో, స్థానిక భజన మండలి వారిచే హరినామ సంకీర్తన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆయా భజన మండలి కళాకారులు హరినామ సంకీర్తన చేశారు. యాదాద్రి ఆలయంలో ప్రప్రథమంగా ఈ హరినామ సంకీర్తనను ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. నెల రోజుల పాటు ఈ హరినామ సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు ఈ హరినామ సంకీర్తనలో పాల్గొని తన్మయత్వం పొందారు. అంతకు ముందు కళాకారులు జయ నారసింహ జై.. ఉగ్ర నారసింహ..లక్ష్మీ నారసింహ జై అంటూ హరినామ సంకీర్తన చేశారు.

ఇటు పోరాటం.. అటు మమకారం !



తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ నల్లగొండ కలెక్టరేట్ ఎదుట రెండవ ఏఎన్‌ఎంలు చేపట్టిన సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఈ సమ్మెలో పాల్గొనడానికి ఓ ఏఎన్‌ఎం తన చంటి బిడ్డతో వచ్చింది. ఆమె తన బిడ్డను అక్కడే లాలించి పడుకోబెట్టి ఆందోళనలో పాల్గొంది.

-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

యువతిని మోసగించిన వ్యక్తికి పదేళ్ల జైలు

రామగిరి(నల్లగొండ): ప్రేమ పేరుతో యువతిని మోసగించిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ మహిళా కోర్టు జడ్జి తిరుపతి గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.... మర్రిగూడ మండలం సరంపేటకు చెందిన యువతి అమ్మమ్మ గ్రామమైన సంస్థాన్‌నారాయణపురం మండలం జనగాంలో ఉంటోంది. రోజు కూలి పని చేస్తూ జీవనం సాగిస్తుంది. కూలి పనికి వెళ్తున్న క్రమంలో నారాయణపురం మండలం వాయిలపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గుండెపంగ నరేష్‌తో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని గయువతికి మాయ మాటలు చెప్పాడు. పలు సార్లు శారీరకంగా లోబర్చుకున్నాడు. 2017 మే 23న పుట్టినరోజు సందర్భంగా యువతిని సర్ల మైసమ్మ గుడికి తీసుకెళ్లాడు. గుడి సమీపంలో యువతిపై లైంగిక దాడి చేశాడు. యువతి వివాహం చేసుకోమని నరేష్‌ను నిలదీయగా నిరాకరించారు. పెద్ద మనుషుల సమక్షంలో కోరినా నరేష్ తిరస్కరించాడు. దీంతో యువతి 2017 మే 25న నారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ పార్థసారథి, ఎస్‌ఐ మల్లీశ్వరి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరమణారెడ్డి వాదనలతో ఏకీభవించిన మహిళా కోర్టు జడ్జి తిరుపతి అత్యారానికి పాల్పడినందుకు గాను సెక్షన్ 376 కింద పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

మిర్యాలగూడ అర్బన్: గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు వేసిన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. మిర్యాలగూడ, కోదాడలో జరిగిన ఈ ఘటనల వివరాలు ఇలా.. మిర్యాలగూడ పట్టణం నాగార్జుననగర్ కాలనీలో నివాసముంటున్న రాగిరెడ్డి జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలసి బుధవారం ఉదయం 10గంటలకు ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. గురువారం ఉదయం పాలు పోయడానికి వచ్చిన వ్యక్తికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో యజమాని జగ్గారెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. దీంతో పట్టణానికి వచ్చిన ఆయన ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందర చేసి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.దుండగులు 6 తులాల బంగారు, 35 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లినట్లు గురించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయన కాలనీలో నివాసం ఉండే గొట్టిపర్తి రమణమ్మ ఉద్యోగ రీత్యా విజయవాడలో ఉంటోంది. ఇంట్లో నివాసం ఉండే ఆమె చిన్న కుమారుడు సతీష్ ఈ నెల 8న వియవాడకు వెళ్లాడు. 12న ఆమె పెద్దకుమారుడు ఇంటికి వచ్చి చూసేవరకు తాళం పగలకొట్టి బీరువా తీసి సామగ్రి చిందరవందరగా పడి ఉంది. విషయాన్ని తల్లి, సోదరుడికి తెలపగా వారు వచ్చి చూసే వరకు బీరువాలో ఉన్న 17.9 తులాల బంగారం, రూ.50వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెట్రోల్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

కట్టంగూర్ : జాతీయ రహదారిపై కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామ శివారులో గురువారం ప్రమాదవశాత్తు పెట్రోలు ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాదు నుంచి విజయవాడ వైపు వెళుతున్న పెట్రోల్ ట్యాంకర్ అయిటిపాముల గ్రామ సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా ఆగిపోయింది. అదే సమయంలో హైదరాబాదు నుంచి ఖమ్మం వెళుతున్న ఆర్టీసీ బస్సు ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 16 మంది ప్రయాణికులకు ఏలాంటి ప్రమాదం జరగపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. ట్యాంకర్ వెనక భాగం పగిలిపోవటంతో విషయం తెలుసుకున్న హిందుస్థాన్ పెట్రోలు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని వేరే ట్యాంకర్‌లోకి పెట్రోలును షిఫ్ట్ చేసి తరలించారు.

ఆరోగ్యం కుదుట పడడం లేదని..

- పురుగుల మందు తాగి ఆత్మహత్య



నాగమ్మ మృతదేహం

మునుగోడు : ఎంతో మంది వైద్యుల వద్ద చికిత్స పొందినా ఆరోగ్యం కుదుట పడడం లేదని మనోవేదనతో ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. మునుగోడు మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మునుగోడు మండలం ఇప్పర్తి గ్రామానికి చెందిన ఆడెపు నాగమ్మ(32) కొంతకాలంగా నోటికంతి బాధపడుతోంది. ఐదు సార్లు శస్త్ర చికిత్స కూడా చేయించుకున్నా ఫలితం కనిపించలేదు. ఇక తనకు వివాహం కూడా కాదని తీవ్ర మనస్తాపం చెందిన నాగమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం పురుగుల మందు తాగింది. గమనించిన చుట్టు పక్కలవారు ఆమెను మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సొదరుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

దేవరకొండ : ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. దేవరకొండ పట్టణానికి చెందిన గొని వేణునాథంగౌడ్ (23) రెండు రోజుల క్రితం ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు, కాలనీవాసులు అతడిని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి తండ్రి శివరాం గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగభూషణంరావు తెలిపారు.

ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలి



నందిపాడులో పంటలను పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : సాగర్ ఎడమకాల్వ ద్వారా నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. మిర్యాలగూడ మండలంలోని నందిపాడులో ఎండిపోతున్న పంటలను గురువారం రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఖరీఫ్‌లో కొంతమంది రైతులు నాట్లు వేసుకుని ఉన్నారని, వర్షాలు సరిగా కురవకపోవడంతో భూగర్భజలాలు సైతం ఎండిపోయాయని తెలిపారు. సాగర్ ఎడమకాల్వ ద్వారా నీరు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగర్ ఎడమకాల్వ ద్వారా నీటిని అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, మండల కార్యదర్శి రవినాయక్, పగిడోజు రామ్మూర్తి, రాగిరెడ్డి మంగారెడ్డి, పాల్వాయి రాంరెడ్డి, పఠాని శ్రీను, భిక్షం, మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎర్రవరంలో హీరో శ్రీకాంత్ దంపతుల పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న హీరో శ్రీకాంత్, ఊహ దంపతులు

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని ఎర్రవరంలోగల దూళ్లగుట్ట శ్రీబాల ఉగ్రలక్ష్మీ నృసింహస్వామి ఆలయాన్ని సినీ హీరో శ్రీకాంత్ కుటుంబ సభ్యులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నలజాల జగన్నాథం, ప్రధాన అర్చకులు ఇనుపకుతికెల లక్ష్మీనరసింహమూర్తిలు శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హీరో శ్రీకాంత్‌తో పాటు భార్య ఊహ, కుమారుడు రోషణ్‌తో కుటుంబ సమేతంగా ఈ పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి తనవవంతుగా సహకారం అందిస్తానని హీరో శ్రీకాంత్ తెలిపారు. అక్కడకు వచ్చిన భక్తులు ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. అనంతరం ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహమూర్తి నివాసానికి వెళ్లి సేదదీరారు.

రూ. 2 లక్షల రుణమాఫీ అసాధ్యం

- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రూ.2 లక్షల రుణమాఫీ అసాధ్యమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. అమలు చేయలేని హామీలతో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు దేశ వ్యాప్తంగా ఒకే విధానం ఉంటుంది తప్ప రాష్ట్రానికో విధానం ఉండదన్నారు. గురువారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు, రైతు బీమా అమలు చేస్తున్నారని, ఇప్పుడు రూ.99,999 రుణ మాఫీ చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా రుణమాఫీ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. సహనం, స్థితప్రజ్ఞ లేని ప్రజా ప్రతినిధులు రాజకీయాలకు పనికిరారని, అనేక సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నా కొందరిలో ప్రజల సమస్యలు వినాలన్న సహనం, ఓపిక లేకుండా పోయిందని పేర్కొన్నారు. సర్పంచుల నుంచి మంత్రుల వరకు ఎవరైనా సుదీర్ఘకాలం రాజకీయాల్లో నిలదొక్కుకోవాలంటే సంయమనం, ఓపిక అవసరమన్నారు. రాజకీయాల్లో సీనియర్లం అని అనుకునే వారు కొంతమందికి అనుభవం ఉన్నా ఆ మెచ్యూరిటీ రావడం లేదన్నారు. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనవసర విషయాల్లో జోక్యం చేసుకొని అసందర్భ వ్యాఖ్యలతో అభాసుపాలు అవుతున్నారన్నారు. ఏ పదవులు వద్దని చెప్పే ఆయనకు రాజకీయం ఎందుకని, సన్యాసం పుచ్చుకుంటే సరిపోతుందన్నారు. పీసీసీ అధ్యక్షుడు ఒక మాట మాట్లాడితే ఈయన ఒక మాట మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతల్లోనే ఐక్యత లేదని, ఇలాంటి వారు రాష్ట్రాన్ని పాలిస్తామని పగటి కలలు కంటున్నారన్నారు. గంధమల్ల కాంట్రాక్టు విషయంలో అర్థంలేని ఆరోపణలు చేశారని, ఏ కాంట్రాక్టు అయినా టెండరు ద్వారానే వస్తుందనే విషయం తెలియదా? అని ప్రశ్నించారు.

ఓపిక లేకుండా పోయిన ఆశావహులు..

ఆశావహులకు అసలు ఓపిక లేకుండా పోతోందని సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. తమకు టికెట్ రాలేదని కాకుండా, పని చేసుకుంటూపోతే పదవులు అనేవి వస్తాయన్నారు. ప్రజలకోసం పని చేసే ప్రభుత్వానికి సహకరించాలన్నారు. అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా తాము సహకరిస్తామని, వారిని గెలిపించేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. తనకు కావాల్సింది కేసీఆర్ అధికారంలోకి రావడమేనన్నారు. రాజకీయాల్లో ఉన్నంత వరకు తాను కేసీఆర్‌తోనే ప్రయాణం చేస్తానన్నారు.